# చేదు నిజం

-చవాన్ సుదర్శన రావు



"రాయుడూ ! రాయుడూ !"

తనకు కొంత దూరంలో ఉన్న హొటలు దగ్గర నిలుచున్న వ్యక్తిని మురళి కేక పెట్టి పిలిచాడు.

"నువ్వా మురళీ? ఎన్నాళ్ళకు కలుసుకున్నాము? ఈ ఊళ్ళో ఉంటున్నావా? ఏం చేస్తున్నావు?". సంభ్రమంగా అన్నాడు రాయుడు మురళిని సమీపించి.

"బాంకు బయట ఉన్న ఈ సైకిలు స్టాండును నడుపుతున్నాను."

"బియ్యే పాసయ్యావని విన్నాను. సైకిలు స్టాండు నడపడమేమిటి? ఏదైనా ఉద్యోగం చూసుకోలేకపోయావా?" ఆశ్చర్యంగా అడిగేడు రాయుడు.

"ఉద్యోగం కోసం ప్రయత్నించి విసిగిపోయి ఈ పని చేపట్టాను" నిస్పృహగా అన్నాడు మురళి.

"పోనీలే మురళీ. కడుపు నింపుకొనడానికి ఏదో ఒక పని చేయాలిగా. ఇందులో ఆదాయం బాగుందా?"

"చెప్పుకోదగ్గ ఆదాయం లేదు. ఓ పూట గడిస్తే మరో పూట వస్తు."

"అదేమిటి? బాంకుకు రోజూ వంద సైకిళ్ళయినా రావా? ఒక సైకిలుకు ఎంత వసూలు చేస్తున్నావు?"

"వందేమిటి? ఇంకా ఎక్కువే వస్తాయి. కాని నాకు ఇవ్వవలసిన పాతిక పైసలు మిగుల్చుకోడానికి అందులో ముప్పాతికమంది సైకిళ్ళను నా సైకిలు స్టాండులో ఉంచకుండా ఇందాక నువ్వు నిలబడ్డావుగా ఆ హొటలు దగ్గరుంచి బాంకు పనులు చూసుకొని వెళ్ళిపోతుంటారు. సర్లే, నీ సంగతి చెప్పు. ఈ ఊరికి ఎప్పుడొచ్చావు? ఏం చేస్తున్నావు?"

"వ్యాపారం చేస్తున్నా. ఈ రోజే రావడం.

"ఏం వ్యాపారం?"

"ఒకటని కాదు. ఏ సరుకు ఎక్కడ చౌకగా లభిస్తే అక్కడి కెళ్ళి కొనుగోలు చేసి మరో చోట అమ్మడం."

"అయితే బాగానే సంపాదిస్తున్నావన్న మాట" అన్నాడు మురళి, రాయుడు ధరించిన ఖరీదైన దుస్తులవైపు చూస్తూ.

"జాగ్రత్తగా నడుపుకొంటే సంపాదనకు లోటుండదు. నీ పరిస్థితి బాగా లేదని తెలిశాక బాధగా ఉంది. కాని కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. దేవుడు అనుగ్రహిస్తే నీకూ మంచి రోజులు రాకపోవు. ఇక వస్తాను మురళీ. వనుంధ్య" అంటూ వెళ్ళిపోయాడు రాయుడు.

వెళ్తున్న రాయుడిని చూస్తూ మురళి గతం గుర్తుకు తెచ్చుకొన్నాడు.

ఇద్దరిది ఒకే గ్రామం. ఇద్దరూ క్లాసుమేట్లు. తాను శ్రద్ధగా చదివి క్లాసులో ఫస్టుగా వచ్చేవాడు. రాయుడికి చదువుమీద ధ్యాస లేదు. పదవ తరగతి తప్పగానే చదువు మానేసి తన మేనమామ ఊరికి వెళ్ళాడు. మళ్ళీ కనబడటం ఈ రోజే.

అర్ధాంతరంగా చదువు మానేసి రాయుడు వ్యాపారంలో దిగి మంచి సంపాదనపరు డయ్యాడు. కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో పాసైన తనకు ఈ దుర్గతి పట్టింది. పోనీలే తన స్నేహితుడైనా బాగుపడ్డాడు, ఎవరి అదృష్టం వారిది - అనుకొన్నాడు మురళి.

వారం రోజుల తరువాత మురళి సినిమా చూడటానికి వెళ్ళగా అక్కడ రాయుడు కనిపించాడు. మురళి అతన్ని ఉత్సాహంగా పలుకరించాడు.

"హుషారుగా ఉన్నావు. ఏమిటి విశేషం?" అన్నాడు రాయుడు.

"ఓ విశేషం ఉంది. తరువాత చెబుతాను" అంటూ మురళి టికెట్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి ఇద్దరికీ టికెట్లు తెచ్చాడు.

సినిమా చూసిన తరువాత హొటల్లో టీ తాగుతూ మురళి చెప్పడం ప్రారంభించాడు.

"నువ్వు ఆ రోజు వెళ్తూ, దేవుడు అనుగ్రహిస్తే నాకు మంచి రోజులు రాకపోవు అన్నావు కదూ? నీ నోటి వాక్కు ఫలించింది. అంతకు క్రితం రోజుకు పది రూపాయలైనా కళ్ళచూడని నేను ఇప్పుడు పాతిక నుంచి ముప్పయి దాకా సంపాదిస్తున్నాను."

"ఉన్నట్టుండి నీ ఆదాయం ఎలా పెరిగింది?"

"నువ్వు వచ్చి వెళ్ళిన మరునటి దినం ఓ సంఘటన జరిగింది. బాంకుకు వచ్చిన ఓ వ్యక్తి తన కొత్త సైకిలును నా స్టాండులో ఉంచకుండా ఆ హొటలు ముందు ఉంచి వెళ్ళాడట. పని ముగించుకొని తిరిగి వచ్చేసరికి తాళం వేసి ఉంచిన సైకిలు కాస్తా గల్లంతు అయింది. ఆ సంఘటనతో హడలిపోయి అందరు నా సైకిలు స్టాండులోనే సైకిళ్ళు ఉంచి వెళ్తున్నారు."

"ఆ చోరీ జరగడంవల్ల నీ అదృష్టం మారిందన్న మాట."

"అదృష్టం మారిన మాట వాస్తవమే. ఆ సందర్భంలో పోలీసులు నన్ను జులుముగా స్టేషనుకు తీసుకెళ్ళి ఆ చోరీ గురించి ప్రశ్నించారు. నాకు తెలియదు మొర్రో అని మొత్తుకొన్నా నన్ను ముప్పుతిప్పలు పెట్టి రాత్రంతా స్టేషనులో ఉంచి మరునటి రోజు వదిలిపెట్టేరు. ఈ చోరీ మూలంగా నేను పోలీసుల చేతుల్లో నానా అవస్థలూ అనుభవించినా నా ఆర్థిక పరిస్థిత మెరుగైంది. ఆ దొంగ ఎవరో కాని, నాకు పరోక్షంగా ఉపకారం చేశాడు."

"ఎవరైతే నేమిగాని, వాని మూలంగా నీకు మేలు జరిగింది. అంతే చాలు."

మూడు రోజుల తదనంతరం మురళి తన సైకిలు స్టాండు దగ్గరుండగా సైకిలు మీద వస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్ తనను చూసి ఆగిపోయాడు. అంతకు క్రితం సైకిలు చోరీ అయిన సందర్భంలో తనను స్టేషనుకు తీసుకెళి ప్రశ్నలతో వేధించిన హెడ్‌కానిస్టేబుల్ అతనే అని గుర్తించగానే మురళి గుండె గుభేలుమంది. అతను మళ్ళీ ఎందుకు వచ్చాడు?

"కంగారు పడకయ్యా బాబూ. నిన్ను మళ్ళీ స్టేషనుకు పట్టుకెళ్ళడానికి రాలేదు. మీ బాంకు దగ్గర సైకిలు చోరీ చేసిన దొంగ దొరికేడు. స్టేషనుకు వెళ్తూ నువ్వు కనబడగా ఆ సంగతి చెబుదామని ఆగాను. కాసేపటి క్రితం వాడు ఓ హొటలు దగ్గర సైకిలు దొంగిలిస్తుండగా నిఘా వేసి పట్టుకొన్నాము. నాలుగు ఉతికేసరికి ఈ బాంకు దగ్గర చేసిన సైకిలు చోరీ కాకుండా, టౌనులో మరో పది సైకిళ్ళు చోరీ చేసినట్టు ఒప్పుకొన్నాడు. అదిగో వాడే ఆ దొంగ. స్టేషనుకు తీసుకెళ్తున్నాము" అన్నాడు హెడ్ కానిస్టేబులు.

మురళి అటువైపు చూశాడు.

చేతులకు బేడీలతో ఇద్దరు కానిస్టేబుళ్ళ మధ్య నడిచి వస్తున్న ఆ వ్యక్తి రాయుడు. దేవుడు అనుగ్రహిస్తే తనకు మంచి రోజులు రాకపోవు అని చెప్పిన రాయుడు. పరోక్షంగా తన ఆర్థిక పరిస్థితేని మెరుగుపరిచిన రాయుడు.

ఇది తాను ఊహించని వాస్తవం. తన స్నేహితుని గురించి వాస్తవం తెలిసిన మీదట మురళి అంతరంగంలో ఎక్కడో ఓ మారుమూల కలుక్కుమంది. ●